రుణమాఫీ కోసం అధికారులకు రైతుల వినతులు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏవో వద్ద రైతులు

దేవరుప్పుల/స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 22: రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలలోపు వ్యవసాయ రుణాలను మాఫీ చేసినట్లు ప్రకటించినా అనేక గ్రామాల్లో వందలాది మందికి మెసేజ్‌లు రాలేదు. రుణమాఫీ కాని రైతులు గురువారం పెద్ద సంఖ్యలో దేవరుప్పుల, స్టేషన్‌ఘన్‌పూర్‌లోని బ్యాంకులకు, వ్యవసా అధికారులకు వద్దకు తరలివచ్చారు. రుణాలను రీషెడ్యూల్ చేసుకున్నా మాఫీ కాలేదని రైతులు ఆవేదన చెందారు. సాంకేతిక సమస్యలుంటే దరఖాస్తు చేయాలని అధికారులు తెలుపడంతో పెద్ద సంఖ్యలో బ్యాంకులకు తరలివచ్చారు. మరోవైపు స్టేషన్‌ఘన్‌పూర్‌లో మండల వ్యవసాయాధికారి చంద్రన్ కుమార్ వద్దకు వెళ్లి సమస్యలను వివరించారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి : డీఈవో

బచ్చన్నపేట, ఆగస్టు 22 : మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని డీఈవో రాము సూచించారు. గురువారం మండలంలోని కొన్నె, పడమటికేశ్వాపూర్, చిన్నరామన్‌చర్ల, కేజీబీవీ పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు తక్కువ ఉండడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తరిగొప్పుల కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

తరిగొప్పుల,ఆగస్టు 22: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని గురువారం ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో రజిత, కార్యదర్శి భాగలక్ష్మి, వసంత రాణి, ప్రేమలత,శారద, అనిత పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన అధికారులు

లింగాలఘనపురం, ఆగస్టు 22 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని గురువారం అధికారులు సందర్శించారు. విద్యార్థినులకు హాస్టల్‌లో వసతులు, భోజనాన్ని, వంట గదిని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేసి పరిశీలించారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలేంధర్‌రెడ్డి, ఎంపీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, కస్తూర్బా స్పెషలాఫీసర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

పాలకుర్తిలో మొక్కలు నాటుతున్న రాములు

స్టేషన్ ఘన్‌పూర్/పాలకుర్తి, ఆగస్టు 22 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులు కోరారు. నాటుదాం ఒక చెట్టు-అమ్మ పేరున కార్యక్రమంలో భాగంగా గురువారం స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సదానందం, పాలకుర్తి మండల కేంద్రంలో ఎంపీడీవో రాములు మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ అమ్మపేరున మొక్కలు నాటడం శుభపరిణామమని అన్నారు. ఇప్పగూడెంలో ఏపీవో ప్రేమయ్య, టెక్నికల్ అసిస్టెంట్ జాంబ, ఫీల్డ్ అసిస్టెంట్ కవితాఎల్లగౌడ్, పాలకుర్తిలో ఏపీవో మంజుల, పంచాయతీ కార్యదర్శి వెంకటచారి మహిళా సంఘం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ అందజేత

నర్మెట, ఆగస్టు 22 : మండలంలోని హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ జనగామ బాధ్యులు గురువారం బ్యాగులు, స్టేషనరీ అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూడల రమేశ్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ పజ్జూరి జయహరి పుట్టిన రోజు సందర్భంగా పేద విద్యార్థులకు టై, బెల్టు, పెన్నులు, నోట్‌బుక్స్, స్టేషనరీ, ఐడీ కార్డులు అందించారన్నారు. ఆమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఆశాలత, క్లబ్ జనగామ ప్రతినిధులు కృష్ణజీవన్‌బజాజ్, బాబు, టీచర్లు విజయ, ఐలమ్మ, వెంకటలక్ష్మి, స్వప్న, సంధ్య, మమత పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలపై కర్షకుల కన్నెర్ర

- షరతులు లేకుండా రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ చేయాలని బీఆర్ఎస్ నేతల డిమాండ్
- రైతుభరోసా నిధులు విడుదల చేయాలి
- మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున రైతుల ధర్నా

శామీర్‌పేట నుంచి జనగామకు తరలివెళ్తున్న నాయకులు

లింగాలఘనపురంలో ధర్నా చేస్తున్న నాయకులు

బచ్చన్నపేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

లింగాలఘనపురం, ఆగస్టు 22 : ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు సంబంధించి రూ.2 లక్షలలోపు పంట రుణాలు మాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామీణ బ్యాంకు ఎదుట ఆందోళన నిర్వహించారు. అంతకు ముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ గోదావరి జలాలతో మండలంలోని చెరువులు నింపే అవకాశమున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సేవెల్లి సంపత్, చిట్ల ఉపేందర్‌రెడ్డి, బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, దుంబాల భాస్కర్‌రెడ్డి, ఏదునూరి వీరన్న, ఎడ్ల రాజు, కేమిడి యాదగిరి, ఉడుగుల భాగ్యలక్ష్మి, గండి యాదగిరి, మహేశ్,కరుణాకర్, కేమిడి వెంకటేశ్, గట్టగల్ల శ్రీహరి, గాదెపాక విష్ణు పాల్గొన్నారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి : మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్రాంచి ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్-హైదరాబాద్ హైవేపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రూ.2 లక్షలలోపు రైతుల పంట రుణాలను షరతులు లేకుండా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు బీఆర్ఎస్ శ్రేణులను పోలీసుస్టేషన్‌కు తరలించి వ్యక్తిగత పూచికత్తుపై విడిచి పెట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వారాల రమేశ్‌యాదవ్, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్‌కుమార్, నాయకులు ముక్క పరశురాములు, రాసమల్ల కొమురయ్య, దుర్గా ప్రసాద్, కొయ్యడ స్వామి, కావటి యాదగిరి, సమ్మయ్య పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి నేతృత్వంలో జనగామలో నిర్వహించే ధర్నాకు శ్రేణులు తరలివెళ్లారు. వీరిలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, మాజీ ఎంపీపీ బావండ్ల నాగజ్యోతీకృష్ణంరాజు, వైస్ ఎంపీపీ అనిల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, నాయకులు నరెడ్ల బాల్‌రెడ్డి, గంగం సతీశ్‌రెడ్డి, బొమ్మెన అంజనేయులుగౌడ్, కొండి వెంకట్‌రెడ్డి, దూడల కనకయ్యగౌడ్, నరేందర్, ఉపేందర్‌రెడ్డి, జావీద్, షబ్బీర్, సిద్ధిరాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మధుప్రసాద్, యాకంరెడ్డి, మహేందర్‌రెడ్డి, కిష్టయ్య, మల్లేశం, కోడూరి శివకుమార్‌గౌడ్ ఉన్నారు.

జనగామ రూరల్‌లో..

జనగామ రూరల్ : అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ధర్నాకు జనగామ మండలం నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు, మాజీ మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు మండల చినబోయిన రేఖ, మండల కార్యదర్శులు ఎడ్ల శ్రీనివాస్, నిమ్మల స్వామి, మాజీ సర్పంచ్‌లు సానబోయిన శ్రీనివాస్, శివరాత్రి స్వప్న రాజు, గ్రామ అధ్యక్షుడు చినబోయిన నర్సయ్య, గుండ్లపల్లి రవి, మడిపల్లి సుధాకర్ గౌడ్, కొర్నిపాక రాజు, మైసాగౌడ్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య పిలుపు మేరకు మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్రాంచి ఎదుట రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. షరతులు లేకుండా రూ.2 లక్షలోపు రుణాలు మాఫీ చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయపాల్ రెడ్డి, నాయకులు మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గబ్బెట బుచ్చయ్య, మాజీ సర్పంచులు, పాల్గొన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు : మండలంలోని మల్కాపూర్ ఇండియన్ బ్యాంక్ వద్ద రైతులతోపాటు బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులకు తీరని అన్యాయం జరుగుతున్నదన్నారు. రూ.2 లక్షలోపు రుణమాఫీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఎంతో మేలు జరిగిందని గుర్తు చేశారు. కారు గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి అవకాశవాదంతో కాంగ్రెస్‌లో చేరారని ఆయన విమర్శించారు. చిల్పూరు ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేసినా నేటికీ పనులు చేపట్టడం లేదన్నారు. స్టేషనఘనపూర్‌లో 100 పడకల ఆసుపత్రి మంజూరైనా నేటికీ అతీగతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎడవల్లి కృష్ణారెడ్డి, చిల్పూరు మండల ఇన్‌చార్జి జనగామ యాదగిరి, నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్ రెడ్డి, నాయకులు కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి, నారగోని రవిచంద్ర, రంగు హరిశ్, లోడెం రజిత-రవీందర్, బబ్బుల వంశీ, వెన్నం మాధవరెడ్డి, గాలి ప్రవీణ్, గుంటి భీములు, రాజ్‌భూపతి, మంతెన రాజు, రంగు రవి, అలుగు అశోక్, ఎడ్ల శ్రీను పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

రఘునాథపల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం : రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 22 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీతో ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతుల పంట రుణాల మాఫీలో మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షలోపు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని డీసీసీ బ్యాంకు ముందు రైతులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. రైతులందరికీ రుణమాఫీ కాకపోవడానికి గల కారణాలను మండల వ్యవసాయాధికారి చంద్రన్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో మంజూరైన పనుల్లో ఏ ఒక్కటీ ప్రారంభించలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో మే, జూన్ నెలల్లోనే గోదావరి జలాలతో చెరువులు నింపేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చి, రైతుబంధు, రైతుబీమా పథకాలతో కేసీఆర్ అన్నదాతలకు భరోసా ఇస్తే సీఎం రేవంత్‌రెడ్డి నీరుగారుస్తున్నారని విమర్శించారు. ప్రజావ్యతిరేక పాలన అందిస్తున్న కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏం ముఖం పెట్టుకుని ఓట్లు అడగుతుందని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని, ఆరు గ్యారెంటీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, మాజీ జడ్పీటీసీ రవి, కూడా మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, మాజీ సర్పంచ్ సురేశ్‌కుమార్, నాయకులు కనకం స్వరూపాగణేశ్, అక్కనపల్లి బాలరాజు, ఇనుగాల నర్సింహారెడ్డి, చందర్ రెడ్డి, గుండె రంజిత్, గొడుగు సంజీవ, ప్రసాద్, గుండె మల్లేశ్, ఆకారపు అశోక్, మాతంగి దేవయ్య, పొన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కలెక్టర్ తనిఖీలు

- మెరుగైన వైద్యం అందించాలి
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశం

జిల్లా ప్రధాన ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా

జనగామ, (నమస్తే తెలంగాణ)/జనగామ రూరల్, ఆగస్టు 22 : రోగులకు మెరుగైన వైద్య సేవలు, నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా వైద్యులకు సూచించారు. గురువారం ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆస్పత్రి, ఎంసీహెచ్ సహా పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఓపీ బ్లాక్‌ను పరిశీలించి సేవలను మరింత పెంచాలని కోరారు. డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు, ల్యాబ్ టెస్టుల వివరాల రిజిస్టర్లును తనిఖీ చేశారు. జిల్లాలో 16 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, బాధితులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. డెంగ్యూ, వైరల్ ఫీవర్ కేసులకు ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసి, ఐసోలేషన్ లో ఉంచాలని, వైద్యులు, నర్సులు, సిబ్బంది మూడు షిఫ్టుల వారీగా పని చేయాలని ఆయన కోరారు. ఈ కేసులను గుర్తించేందుకు గాను ఎమర్జెన్సీ నిమిత్తం కలర్ కోడ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రోగులకు అందించే ఆహారం పట్ల నిర్లక్ష్యం తగదని, వారికి సరైన టెస్టులు, ట్రీట్మెంట్, మందులు సమయానుకగుణంగా ఇవ్వాలని ఆదేశించారు. ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వానకాలం దృష్ట్యా ఆరోగ్యం పట్ల ఎంతమాత్రం అశ్రద్ధ వహించరాదని, జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లి సరైన రక్త పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా కేంద్రంలోని వారాహి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఎస్‌కేఎస్ ఆస్పత్రులను సందర్శించి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. వైద్యులు, సిబ్బంది డీఆర్ఏ (డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ) ప్రకారం నిబంధనలు పాటించాలన్నారు. రోగుల నుంచి అడ్డగోలుగా వసూలు చేయొద్దన్నారు.

అర్బన్ పీహెచ్‌సీలో అదనపు కలెక్టర్ తనిఖీలు..

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని, డెంగ్యూ జ్వరాలు ఉన్న చోట వైద్య పరీక్షలు చేయించాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని ధర్మకంచ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను సమర్ధవంతంగా నిర్వహించాలని, ఔట్ పేషంట్‌ల సంఖ్య నమోదును పెంచాలన్నారు. ఆయన వెంట జిల్లా యువజన క్రీడల అధికారి వెంకట రెడ్డి, వైద్యాధికారి, సిబ్బంది, యువజన క్రీడల శాఖ సిబ్బంది రాకేశ్ ఉన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : కడియం

జఫర్‌గఢ్, ఆగస్టు 22 : అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకనుగుణంగానే సీఎం రేవంత్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసిల్ కార్యాలయంలో తహసీల్దార్ కనకయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కల్యాణలక్ష్మి పథకంలో 59 మంది లబ్ధిదారులకు రూ.59 లక్షల 6 వేల 844, సీఎంఆర్ఎఫ్‌లో 26 మందికి రూ.6 లక్షల 68 వేల 500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో గ్రామపంచాయతీలకు నిధులతోపాటు రైతు భరోసా నిధులు విడుదల చేసే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జఫర్‌గఢ్‌లో నాలుగు లైన్ల రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్, రూ.50 కోట్లతో సమీకృత గురుకుల విద్యాలయ క్యాంపస్‌ను నిర్మించనున్నట్లు శ్రీహరి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాసెట్టి హరిప్రసాద్, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి పొన్నాల ఫౌండేషన్ సాయం

వెంకన్నకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ధర్మపురి శ్రీనివాస్

జనగామ, (నమస్తే తెలంగాణ), నర్మెట, ఆగస్టు 22 : నర్మెట మండలం లోక్యతండాకు చెందిన నిరుపేద విద్యార్థి భూక్యా వెంకన్న ఉన్నత చదువు కోసం మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య దాతృత్వంలో పొన్నాల ఫౌండేషన్ ద్వారా రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. వెంకన్న పసితనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి జనగామ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉంటూ పదో తరగతి పూర్తి చేసి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి పైచదువుల కోసం ఢిల్లీలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సీటు సాధించాడు. విద్యార్థి పరిస్థితిని తెలుసుకున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య స్పందించి మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, ఎండి మాజీద్, సాడ మహేష్ ద్వారా ఆర్థిక సాయం అందించారు.

పేదింటి ఆడబిడ్డల వివాహాలకు చేయూత

బచ్చన్నపేట, ఆగస్టు 22 : మండలంలోని కొన్నె గ్రామంలో గురువారం జరిగిన వివాహాలకు బీఆర్ఎస్ నేత కోడూరి శివకుమార్‌గౌడ్ హాజరయ్యారు. మల్ల ఐలమ్మ, ఐలయ్య కుమార్తె భార్గవి, ఇతికాల సత్తమ్మ, బాలమల్లయ్య కుమార్తె దివ్య వివాహ వేడుకల్లో పాల్గొని రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిరాములు, క్రాంతికుమార్, కిష్టయ్య, రాజయ్య, బాలస్వామి, చంద్రయ్య, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లున్నవారు ఓటు నమోదు చేసుకోవాలి

పాలకుర్తి/కొడకండ్ల, ఆగస్టు 22: 1 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో బీఎల్ఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటరు జాబితా 29 ఆగస్టు 2024 నుంచి 18 అక్టోబర్ 2024 వరకు జరుగుతుందన్నారు. పూర్తి చేసిన ఓటర్ జాబితాను అక్టోబర్ 29న ప్రకటిస్తామన్నారు. జాబితాపై అభ్యంతరాలుంటే 29 అక్టోబర్ 2024 నుండి 28 నవంబర్ 2024 వరకు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోనర్సింహమూర్తి, నాయబ్ తహసీల్దార్ ఆర్ వేణు, ఆర్ఐ రాకేశ్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కొడకండ్లలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో మండలంలోని బీఎల్‌వోలకు తహసీల్దార్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటరు సవరణ చేసి తుది జాబితా తయారు చేయాలని కోరారు.

మరిన్ని జిల్లా వార్తలు 9వ పేజీలో

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఏసీపీ

నిందితుడి అరెస్టు చూపిస్తున్న పోలీసులు

లింగాలఘనపురం; ఆగస్టు 22 : యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ అన్నారు. మండలంలోని వడిచర్లలో గంజాయికి బానిసైన సాతెల్లి కార్తీక్(22)ను గురువారం అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 75 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ మాట్లాడుతూ కార్తీక్ 2021లో జనగామలో చదువుతూ నవాబుపేటకు చెందిన మిత్రుడు బొల్లంపెల్లి మణికంఠ ద్వారా గంజాయి, తాగుడుకు బానిసగా మారాడన్నారు. అనంతరం హైదరాబాద్‌లోని దూల్‌పేటలో గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా గంజాయిని కొనుగోలు చేస్తుండడంతో పోలీసులు అరెస్ట్ చేశారని ఆయన తెలిపారు. సమయ స్ఫూర్తితో నిందితుడిని పట్టుకున్న ఎస్సై బండి శ్రావణ్‌కుమార్, హెచ్‌సీ శంకర్, పీసీలు కృష్ణ, నవీన్‌ను ఏసీపీ భీంశర్మ అభినందించారు. కార్యక్రమంలో సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

29న జిల్లాలో గవర్నర్ పర్యటన

జనగామ, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈనెల 29న జిల్లా పర్యటనకు రానున్నారని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. వరంగల్ నుంచి రోడ్డు మార్గంలో ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకొని జిల్లా అధికారులను కలుసుకున్న అనంతరం 11.35గంటలకు జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామాన్ని సందర్శిస్తారని తెలిపారు. ప్రముఖ రచయితలు, కవులు, కళాకారులు సహా జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తారని పేర్కొన్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2.10 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి కొలన్‌పాక జైన దేవాలయం, స్వర్ణగిరి ఆలయాన్ని దర్శించుకుంటారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి ఆయన గవర్నర్ జిల్లా పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, జడ్పీ సీఈవో సరిత పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపర్చడంలో కళాకారుల కృషి అభినందనీయం

కళాకారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న డీపీఆర్‌వో శ్రీనివాస్‌రావు

జనగామ, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : సమాజంలోని మూఢనమ్మకాలు, గుడుంబా, గుట్కా వంటి మహమ్మారి వ్యసనాలు పారద్రోలేందుకు జానపద కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా పౌరసంబంధాల అధికారి శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని నిర్వహించారు. జానపద కళాకారులతో కలిసి ఆయన కేక్ కట్ చేయించారు. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రజలను రంజింప చేస్తున్న జానపదాలు సమాజం ఉన్నంతకాలం జీవించే ఉంటాయన్నారు